కల్యాణం.. దయనీయం

- నిర్లక్ష్యపు హాల్లో రైల్వే కల్యాణ మంటపం
- ముఖ్య కూడలిలో ఉన్నా.. కానరాని అభివృద్ధి
- ఏసీ సౌకర్యం ప్రతిపాదనలకే పరిమితం
- అరకొర వసతులున్నా.. ప్రైవేట్ హాళ్లే మేలంటున్న ప్రజలు

సామర్లకోట: అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని.. అన్న చందంగా మారింది రైల్వే శాఖ పరిస్థితి. పట్టణానికి ముఖ్య కూడలిలో ఉన్న రైల్వే కల్యాణ మంటపంపై రైల్వే శాఖ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. సుమారు 17 ఏళ్ల క్రితం విశాల స్థలంలో రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌కు అతిసమీపంలో రైల్వే కల్యాణ మంటపాన్ని నిర్మించారు. రైల్వే ఉద్యోగులకు రోజుకు రూ.మూడు వేలు, ఇతరులకు రూ.25 వేలు అద్దెగా నిర్ణయించారు. దీనికితోడు రూ.10 వేలు కార్పస్ ఫండ్‌గా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.. పార్కింగ్‌కు కూడా అనువైన స్థలం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు, రెండు అంతస్తులతో కల్యాణ మంటపం ఉంది. ఈ కల్యాణ మంటపంలోని మొదటి, రెండో అంతస్తులలో రూములు ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకూ ఏ ఫంక్షన్ జరిగినా అందరూ రైల్వే కల్యాణ మంటపానికే ప్రాధాన్యం ఇచ్చేవారు. కాల క్రమేణా ప్రతి ఒక్కరూ ఏసీ కల్యాణ మంటపాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఏసీ కల్యాణ మంటపాలకు రూ.40 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. దీనికితోడు లైటింగ్ ఖర్చులు అదనం. సామర్లకోట రైల్వే కల్యాణ మంటపానికి ఏసీ సదుపాయం కల్పించాలని ఐదేళ్లుగా ప్రతిపాదనలున్నా.. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దాంతో ఈ కల్యాణ మంటపం ప్రజలకు అందుబాటులో ఉన్నా.. అంతగా అక్కరకు రావడం లేదు.



సామర్లకోట రైల్వే కల్యాణ మంటపం



నిర్వహణ సక్రమంగా లేక గోడకు పగుళ్లు, మొలిచిన మొక్కలు

ఏసీ సౌకర్యం కల్పిస్తే..

రైల్వే కల్యాణ మంటపానికి ఏసీ చేస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటుందని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు. రైల్వే కల్యాణ మంటపానికి ఏసీ చేస్తే మరో రూ.20 వేల వరకు అద్దె పెరిగే అవకాశం కూడా ఉంటుంది. దాంతో రూ.45 వేలకే ఏసీ కల్యాణ మంటపం వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు రైల్వే కల్యాణ మంటపానికి చేసే డిపాజిట్లు స్థానిక అధికారుల పర్యవేక్షణలో ఉండేవి. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ పేమెంట్స్ కావడంతో, కల్యాణ మంటపం చిన్న మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి.

పార్కింగ్ లేని మంటపాలెన్నో..!

ఇరుకుగా, కనీసం పార్కింగ్ సదుపాయాలు లేని ఏసీ ప్రైవేటు కల్యాణ మంటపాలు పట్టణంలో పెరుగుతున్నాయి. అయినా ఏసీ కారణంగా ప్రజలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. వీటి నిర్మాణాలు జరిగే సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు ఏవిధంగా ఇస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రోడ్డులో ఉన్న కల్యాణ మంటపాల వద్ద వేడుకలు జరుగుతున్న సమయంలో వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

రైల్వే శాఖ దృష్టి పెట్టాలి



వివాహాలతో పాటు, అనేక శుభకార్యాలు ఎక్కువగా వేసవి కాలంలోనే జరుగుతాయి. వాతావరణంలో వచ్చిన మార్పులతో నిత్యం ఎండలు ఎక్కువగానే ఉంటున్నాయి. దాంతో ప్రతిఒక్కరూ ఏసీ కల్యాణ మంటపాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అనేక ప్రాంతాలకు ముఖ్య కూడలి ప్రదేశంలో ఉన్న రైల్వే కల్యాణ మంటపానికి ఏసీ కల్పించడంపై రైల్వే అధికారులు దృష్టి సారించాలి. ప్రజలకు అందుబాటు అద్దెలు ఉంచాలి.

– తోటకూర గంగాధర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, సామర్లకోట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కల్యాణ మంటపాలకు ఏసీల ప్రాధాన్యం పెరగడంతో, రైల్వే కల్యాణ మంటపానికి ఏసీ చేయాలని రైల్వే జీఎం దృష్టికి తీసుకు వెళ్లాం. విజయవాడ డివిజన్ అధికారుల సూచనల మేరకు ఎలక్ట్రికల్ అధికారులు సర్వే చేశారు. ఇటీవల జరిగిన కల్యాణ మండప కమిటీ సమావేశంలోనే ఏసీపై సూచనలు వచ్చాయి. త్వరలో ఏసీ వసతి వస్తుందని ఆశిస్తున్నాం. భవనంపై పెరుగుతున్న మొక్కలపై సీనియర్ సెక్షన్ ఇంజినీరు(వర్క్స్) దృష్టికి తీసుకు వెళతాం.

– ఎం రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, సామర్లకోట

క్లుప్తంగా

22 నుంచి రీ సర్వేపై గ్రామ సభలు

సామర్లకోట: రీ సర్వేలో ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను స్వీకరించడానికి ఈ నెల 22 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. దస్తావేజుల్లోను, పాస్‌బుక్‌ల్లోను ఉన్న భూమి ప్రకారం రీ సర్వేలో రాకపోవడంపై, వాటిని సవరణ చేయడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22న ఉండూరు, 23న వల్లూరు, 25న మామిళ్లదొడ్డి, 26న మాధవ పట్నం, 29న అచ్చంపేట, కొప్పవరం, నవంబరు 2న పనసపాడు, 5న గొంచాల, 6న నవర, 7న పంద్రవాడ, 8న పవర, 12న చంద్రంపాలెం, 13న కాపవరం, 14న పి.వేమవరం, 16 వీకే రాయపురం, 19న బోయనపూడి, 20న మేడపాడు, పెద్దబ్రహ్మదేవం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

ప్రతిభ వెలికితీసేందుకు ఏసీటీ దోహదం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సూరిబాబు రాజు

పెద్దాపురం: ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ (ఏసీటీ) ఎంతగానో దోహదపడుతుందని పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఏసీటీ చైర్మన్ రామశాస్త్రి అన్నారు. స్థానిక ఏసీటీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజేతలకు ఆయన బహుమతీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏసీటీ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన సభ జరిగింది. వారు మాట్లాడుతూ ఏసీటీని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో క్రియా కార్యదర్శి జగన్నాథం, వీసీసీ, ఏటీసీ సభ్యులు, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులపై గోతుల పూడ్చివేత



కెనాల్ రోడ్డులో గోతులను పూడ్పిస్తున్న ఆయా గ్రామాల నాయకులు

సామర్లకోట: కెనాల్ రోడ్డులో అడుగడుగునా ఏర్పడిన గోతుల కారణంగా తరచూ ప్రమాదాలు జరిగి అనేక మంది క్షతగాత్రులు కావడం, కొందరు ప్రాణాలనూ కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో హుస్సేన్‌పురం నుంచి పీబీ దేవం వరకున్న ఆయా గ్రామాలకు చెందిన నాయకులు గోతుల పూడ్చివేతకు ముందుకు వచ్చారు. పీబీ దేవం నుంచి తోటకూర శ్రీనివాసు, జి.మేడపాడు నుంచి పాలకుర్తి శ్రీనివాసాచార్యులు, వేట్లపాలెం నుంచి మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, హుస్సేన్‌పురం నుంచి చల్లా బుజ్జి ముందుకు వచ్చి సహకారం అందించారు. కంకర రాళ్లను గోతులలో వేసి, దానిపై క్రషర్ బూడిదతో జేసీబీ సాయంతో పూడ్చివేశారు. దీంతో వాహనదారుల రాకపోకలు సురక్షితంగా సాగించేందుకు అవకాశం ఏర్పడింది. దాంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉచిత మెగా హోమియో వైద్య శిబిరం



హోమియో మందులను అందిస్తున్న ప్రతినిధులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో శ్రీమ్ అపర్ణ సేవా ట్రస్ట్, వీరభద్ర హోమియో క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డెంగీ, వైరల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అంకొండ వెంకటేశ్వరశర్మ, వైద్యులు సూర్యపవన్‌రామ్, నాగ మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం సినిమాలు

లలితా స్క్రీన్–1: మా నాన్న సూపర్ హీరో, విశ్వం
లలితా స్క్రీన్–2: దేవర పార్ట్–1
వీరభద్ర: వేట్టయన్ ది హంటర్
శోభా: ఇద్దరూ ఇద్దరే..

సామర్లకోట

అనుశ్రీ స్క్రీన్–1: దేవర పార్ట్–1
అనుశ్రీ స్క్రీన్–2: జనక అయితే గనక
విఘ్నేశ్వర: విశ్వం, వేట్టయన్ ది హంటర్

పిఠాపురం

వెంకటేశ్వర : జనక అయితే గనక
అన్నపూర్ణ : ఇద్దరూ ఇద్దరే..
సత్య : విశ్వం, వేట్టయన్ ది హంటర్
పూర్ణ : దేవర పార్ట్–1

ఉప్పాడలో..

శ్రీనివాస : దేవర పార్ట్–1

రామస్వామి సేవలు చిరస్మరణీయం



రామస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పెద్దాపురం: వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గవరసాని రామస్వామి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. పెద్దాపురం మండలం మర్లావ గ్రామంలో ఆదివారం ఆయన ఐదో వర్ధంతి సందర్భంగా రామస్వామి విగ్రహం వద్ద పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు గవరసాని దివాకర్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ, రామస్వామి సేవలను కొనియాడారు. పార్టీలకతీతంగా రైతులకు సేవలందించిన ఘనత రామస్వామికే దక్కుతుందన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడు రామస్వామి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

బీజేపీ సభ్యత్వాలకు గడువు

సామర్లకోట: బీజేపీ సభ్యత్వ నమోదును ఈ నెల 30 వరకు పొడిగించినట్టు పార్టీ నాయకులు గొరకపూడి చిన్నయ్యదొర తెలిపారు. ఆదివారం సాయంత్రం సంపెంగతోటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు సభ్యత్వాల నమోదును పొడిగించినట్టు చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ తీరం



కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

పర్యాటకులతో కిటకిటలాడిన సాగర తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచే కాకుండా, పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిన్నా పెద్దా తేడా లేకుండా, ఆటపాటలతో పర్యాటకులు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగర తీరంలో సేదతీరారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మ తల్లి లోవ అమ్మవారిని దర్శించుకుని వెళ్లిన భక్తులు, మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. తీరంలో ఎక్కడా సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కనీసం కూర్చోవడానికి బెంచీలు, తాగేందుకు మంచి నీరు అందుబాటులో లేక తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పర్యాటక ప్రాంతంగా మారుతున్న ఉప్పాడ బీచ్ రోడ్డుపై పర్యాటక శాఖ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, జిల్లాలో సాగర తీరమైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పర్యాటకులు అధికారులను కోరుతున్నారు.

బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి

సీఐ కృష్ణభగవాన్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ప్రతిఒక్కరూ బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, అనుమతి లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీపావళిని దృష్టిలో ఉంచుకొని లైసెన్సు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న వారి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు. ముందుగా బాణసంచా కొనుగోలు చేసి ఇళ్లలో ఉంచుకొనే వారు, బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ అధికారులతో కలిసి మండల పరిధిలోని వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేసి, సూచనలు ఇచ్చామని చెప్పారు. ఇప్పటికే నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. పండగలను పురస్కరించుకొని ఇళ్లకు తాళాలు వేసి, బయటకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యాప్ ద్వారా, ఫోన్ ద్వారా, సచివాలయం ద్వారా సమాచారమిస్తే, వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. తాళాలు వేసి ఊళ్లకెళ్లే సమయంలో విలువైన సామగ్రి ఉంచడం సరికాదన్నారు. రాత్రి సమయాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచినట్టు చెప్పారు. అవగాహన లోపం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ సీఐ అంకబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా వేణు



సామర్లకోటలోని ఇస్మాయిల్‌నగర్ అభివృద్ధి కమిటీ

సామర్లకోట: పట్టణంలో అత్యంత ప్రధాన ప్రాంతమైన ఇస్మాయిల్ నగర్‌కు సంబంధించి అభివృద్ధి కమిటీని ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షునిగా పబ్బు వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాటంరెడ్డి ఏడుకొండలు, కోశాధికారిగా దొడ్డా సుధాకర్, గౌరవ అధ్యక్షురాలుగా యాళ్ల పద్మలత, చీఫ్ అడ్వయిజర్‌గా తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా షేక్ జిలానీ, ద్వారంపూడి వెంకటరెడ్డి, కార్యదర్శులుగా పి.దుర్గారావు, వి.అప్పలరాజు, డి.శివశంకర్, తాళ్లూరి వైకుంఠం, మరో 8 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా కనకదుర్గ నిమజ్జన ఊరేగింపు



ఊరేగింపులో వివిధ వేషధారణలు



ఆలయం వద్ద అమ్మవారి ఊరేగింపు

సామర్లకోట: పట్టణంలో కనకదుర్గ గ్రామోత్సవ ఊరేగింపు ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక మాసరమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని వివిధ దేవతామూర్తుల వేషధారణ, బ్యాండ్ మేళం, డప్పుడ్యాన్సులతో ఊరేగింపు సాగింది. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారిని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయం నుంచి చంద్రశేఖరస్వామి గుడి వీధి, పాత తహసీల్దార్ కార్యాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, బోనాసువారి వీధి, సీతాఫలదొడ్డి, బళ్ల మార్కెట్ సెంటర్, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్ మీదుగా గోదావరి కాలువ రేవు వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గ్రామాభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి

ఎమ్మెల్యే చినరాజప్ప



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: రాష్ట్ర ప్రగతి గ్రామాల అభివృద్ధితోనే ముడిపడి ఉందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. వేట్లపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన పల్లె పండుగను కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు పల్లె పండుగ పేరుతో శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే రోడ్ల నిర్మాణంపై దృష్టి పెడతారన్నారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ పని చేయాలని కోరారు. ఎన్నికల వరకే పార్టీలని, అ తరువాత ప్రజల అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పెద్దాపురం నియోజకవర్గాన్ని ఐదేళ్లలో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.45 లక్షలతో జరిగే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి, రైసు మిలర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు నున్నా రామకృష్ణ, ఎంపీడీఓ కె హిమమహేశ్వరి, ఈఓపీఆర్డీ భైరవమూర్తి, ఏపీఓ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



అగ్నికి ఆహుతి అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

పిఠాపురం: హఠాత్తుగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియక స్థానికులు పరుగులు తీశారు. వన్నెపూడి కోనేరు సమీపంలో పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అది పూర్తిగా కాలిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో, గ్రామం అంతా చీకట్లు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం



రోడ్డుపైనే కట్టేసిన పాడి పశువులు



చిన్న కలవలదొడ్డిలో కుళాయి వద్ద మురుగు నీరు

కొత్తపల్లి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు మచ్చుకైనా కానరావడం లేదు. పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్య వైఖరి మండలంలోని కొమరగిరిలో కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది. చిన్న కలవలదొడ్డిలో తాగునీరు కుళాయి వద్ద మురుగునీరు నిలిచిపోయింది. స్థానికంగా ఉన్నవారు గేదలను రోడ్లపైనే కట్టేయడంతో రహదారి మురికికూపంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మూసుకుపోవడంతో మురుగునీరు వెళ్లే వీల్లేక రోడ్డుపై నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమల బాధ భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.







పీబీసీలో సందడి చేస్తున్న నీటి కుక్కలు

నీటి కుక్కల సందడి

పిఠాపురం: కనుమరుగవుతున్న జాతుల్లో ఒకటైన నీటి కుక్కలు పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ)లో సందడి చేశాయి. భూమి మీద, నీటిలోను సంచరించే ఉభయ చర జీవుల్లో ఒకటైన నీటి కుక్కలు గోదావరి నది పరివాహక ప్రాంతాలతో పాటు, మడ అడవుల్లోను అరుదుగా కనిపిస్తుంటాయి. అలాంటి నీటి కుక్కలు సామర్లకోట, పిఠాపురం మధ్యన పీబీసీలో కనువిందు చేశాయి. ఈ నేపథ్యంలో వాటిని చూసేందుకు స్థానికులు ఉత్సాహం చూపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు.